పత్రికా ప్రకటన - 1

# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

తేదిః 26.07.2014

తెలంగాణ రాష్ట్రంలో విద్యా రంగాన్ని పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేయాల్సిన అవసరం వుందని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అన్నారు.

అమెరికా, బ్రిటన్ లాంటి దేశాలలో మాదిరిగా తెలంగాణలో స్థాయి బేధం లేకుండా అన్ని వర్గాల వారు ఒకేచోట విద్యనభ్యసించే కామన్ స్కూల్ విధానం తీసుకురావటం తనకున్న పెద్ద కల అని ముఖ్యమంత్రి చెప్పారు. ఏకీకృత సర్వీసు రూల్స్‌తో పాటు పలు సమస్యలను విన్నవించడానికి 16 ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు సచివాలయంలో ముఖ్యమంత్రిని కలిశారు. ఈ సందర్భంగా విద్యారంగం ప్రస్తుత పరిస్థితి, భవిష్యత్తులో విద్యా రంగాన్ని మంచిగా తీర్చిదిద్దే అంశాలపై చర్చ జరిగింది. ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు డిమాండ్ విషయంలో త్వరలోనే ఓ ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకొంటామని ముఖ్యమంత్రి ప్రకటించారు. టిఆర్ఎస్ ఎన్నికల మెనిఫెస్టోలో కేజి నుండి పిజి వరకు ఉచిత నిర్బంధ విద్య అందిస్తామనే హామి ఇచ్చామని, దానికి నూటికి నూరు శాతం కట్టుబడి వున్నామని చెప్పారు. వచ్చే ఏడాది నుండి ఈ పథకాన్ని అమలు చేస్తామన్నారు. అయితే ఈ విద్యా విధానాన్ని ఎలా నడపాలి అనే విషయంపై త్వరలోనే టీచర్లు, లెక్చరర్లు, ప్రొఫెసర్లు, ఇతర విద్యావేత్తలతో సమావేశం నిర్వహించనున్నట్లు సిఎం ప్రకటించారు. పాఠశాల విద్య కూడా మానవవనరుల అభివృద్ధిలో భాగమేనని, బడిలోనే విద్యార్థి భవితకు బాటలు పడతాయని ముఖ్యమంత్రి చెప్పారు. అందుకే బడిలోనే బావి పౌరులను తీర్చిదిద్దాలని చెప్పారు. కేజి టూ పిజి ఉచిత విద్యా విధానం ఒకేసారి కాకుండా ఒకటో తరగతి నుండి ప్రారంభించి క్రమంగా 12వ తరగతి వరకు పెంచుకుంటూ పోతామని చెప్పారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలు కొనసాగుతూనే ఈ ప్రత్యేక పాఠశాలలు కూడా నడుస్తాయని ముఖ్యమంత్రి చెప్పారు. 12 ఏళ్ల తరువాత కేజి టూ పిజి ఇంగ్లీషు

మీడియం స్కూళ్లు రాష్ట్రమంతా విస్తరిస్తాయని వెల్లడించారు. ప్రభుత్వాలు ఇప్పటివరకు అనుసరించిన అడ్డగోలు విధానాల వల్ల ప్రభుత్వ పాఠశాలలు మూతపడే పరిస్థితి వచ్చిందని, ప్రజలు ప్రైవేటు పాఠశాలలపైనే నమ్మకం వుంచాల్సిన అనివార్యత ఏర్పడిందని చెప్పారు. ఈ పరిస్థితిలో పూర్తి మార్పు రావాలని, ప్రైవేటు పాఠశాలల నుండి పిల్లలు సర్కారు బడికి బాట పట్టే వాతావరణం రావాలన్నారు. ఉపాధ్యాయులు కూడా ధర్మబద్దంగా పనిచేయాల్సిన అవసరం వుందని చెప్పారు. ఉపాధ్యాయుల ప్రతి సమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్దంగా వుందని, అదే సమయంలో ఉపాధ్యాయులు కూడా తమ గురుతర బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. నేటి పిల్లలు ప్రపంచంతో పోటిపడేలా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలని సూచించారు. బావి తరాలను బాగు చేయకుంటే మనమంతా పెద్ద నేరం చేసినవారమవుతామని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య ఉచితంగా అందాలని, అమెరికా అధ్యక్షుని కొడుకు కూడా ఆ దేశంలోని కామన్ స్కూల్‌లోనే చదువుతాడని తెలంగాణలో కూడా ఆ పరిస్థితి రావాలని చెప్పారు.

గ్రామాల్లో వున్న అంగన్ వాడి కేంద్రాలను ప్లే స్కూళ్లుగా మార్చే ఆలోచన కూడా వుందని చెప్పారు. ఉపాధ్యాయలందరికి ఒకే విధమైన సర్వీసు నిబంధనలు అమలయ్యే విషయంలో ప్రభుత్వం అన్నిసంఘాలతో చర్చలు జరుపుతుందని వెల్లడించారు.

ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఎమ్మెల్సీలు పూల రవీందర్, కె.జనార్దన్ రెడ్డి, ఎఐటిఒ అధ్యక్షుడు బి.మోహన్ రెడ్డి, వివిధ సంఘాల నాయకులు పి.వెంకట్ రెడ్డి, టి.సాయిరెడ్డి, ఎం.మహిపాల్ రెడ్డి, బి.భుజంగ రావు, జి.సమ్మయ్య, ఎమ్.మల్లయ్య, ఎన్.ధమణేశ్వర్ రావు, ఎస్.సోమేశ్వర్ రావు, కె.మల్లికార్జున్ రెడ్డి, ఎస్.లక్ష్మా రెడ్డి, పి.సర్వోత్తమ రెడ్డి తదితరులు వున్నారు.

---

సిపిఆర్ఓ టు సిఎం.